తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
07 సెప్టెంబర్ 2026

## చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి

**మక్తల్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):**
మక్తల్ పట్టణంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంత్రి వాకిటి శ్రీహరి తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు.
?ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం భూస్వామ్య శక్తులకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను, త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 10న పట్టణంలో చేపట్టే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రజలు, ప్రజాసంఘాలు, యువత పెద్ద



ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేద్దాం - అంధత్వాన్ని నివారిద్దాం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**
"నేత్రదానం చేద్దాం - అంధత్వాన్ని నివారిద్దాం" అనే నినాదంతో ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు వనపర్తి జిల్లా జనరల్ ఆసుపత్రి ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు నేత్రదానం ప్రాధాన్యతను వివరించారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అనే సందేశంతో నేత్రాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆప్తమాలజీ హెచ్ఓడీ వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా చూపు కోల్పోయిన వారికి వెలుగును అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, మరణానంతరం నేత్రాలను దానం




చేయడం ద్వారా అవసరమైన వారికి చూపును అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు.వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వనపర్తి జిల్లా జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, ఆర్ఎంఓ డాక్టర్ జావిద్, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, ఆప్తమాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దివ్య, డాక్టర్ ఉపేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్ గౌరీదేవి, మెడికల్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

**నారాయణపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఆపరేషన్ డీఈ రాజు నాయక్ సూచించారు. మండపాలకు ఐఎస్ఐ మార్క్ కలిగిన నాణ్యమైన విద్యు త్ వైర్లు, 6 ఎం.ఎం. కోర్ సర్వీస్ వైర్ వినియో గించాలని తెలిపారు. విద్యుత్ బోర్డులను నాణ్యమైనవి ఏర్పాటు చేసి, చిన్నపిల్లలకు అందకుండా భద్రంగా ఉంచాలన్నారు. రేకుల


10లో.

షెడ్లలో వర్షపు నీరు విద్యుత్ వైర్లు, బోర్డుల్లోకి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షాక్ తగలకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. భారీ విగ్రహాల కంటే చిన్న విగ్రహాలను ఏర్పాటు చేసుకుంటే రవాణా సులభంగా ఉండటంతో పాటు ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని అన్నారు. 11 అడుగులకు పైగా ఉన్న భారీ విగ్రహాలను ఇరుకైన రోడ్లలో తరలించడం వల్ల

## ఎన్‌హెచ్-44పై ఘోర రోడ్డు ప్రమాదం



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ఎన్‌హెచ్–44పై టెన్త్ పటాలం ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ పంప్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గద్వాల వైపు వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో కారులో ఉన్న మౌనిక, సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ ముఖేష్ కారును నడుపుతున్నట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం లేదా ఇతర కారణాలా అన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నర్సాపూర్‌లో జాతీయ రాక్‌బాల్ ఛాంపియన్‌షిప్

- బీవీఆర్ఐటీ కళాశాలలో 10వ సీనియర్ నేషనల్, 7వ సీనియర్ మిక్స్‌డ్ నేషనల్ పోటీలు ప్రారంభం



**నర్సాపూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**
నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో అజయ్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ సీనియర్ నేషనల్, 7వ సీనియర్ మిక్స్‌డ్ నేషనల్ రాక్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు.
ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.
ఈ సందర్భంగా ఆల్ ఇండియా రాక్‌బాల్ అధ్యక్షుడు శివకుమార్, జనరల్ సెక్రటరీ భూపేందర్ సాగువన్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు, క్రీడాభిమానులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.జాతీయ స్థాయి రాక్‌బాల్ పోటీలకు నర్సాపూర్ వేదిక కావడం పట్ల నిర్వాహకులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడల అభివృద్ధికి ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గోమాంసం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎస్సైకి ఫిర్యాదు చేసిన బీజేవైఎం మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్

**కృష్ణ, సెప్టెంబర్ 6, (జనంసాక్షి):**
కృష్ణ మండలం తంగిడిగి గ్రామంలో అక్రమ గోమాంసం రవాణా, అమ్మకం పై బీజేవైఎం మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆది


10లో.

వారం స్థానిక ఎస్సై నవీద్ కు వారు ఫిర్యాదు చేశారు. తంగిడికి గ్రామ పరిధిలో గోమాంసం అక్రమ రవాణా, అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో మండల బీజేవైఎం అధ్యక్షులు స్పందించారు. ఈ అక్రమ కార్యకలాపాలను వెంటనే అరికట్టాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని వారు ఎస్సైను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్సై నవీద్ ఇలాంటి అక్రమ గోమాంసం రవాణా అమ్మకం ఇకనుండి ఎవరైనా జరిపితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని గ్రామస్తులను హెచ్చరించారు.

## ఇది ప్రజా పాలన కాదు.. వెయ్యి రోజుల పీడ పాలన

**పటాన్చెరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 420 హామీలు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో భాగంగా ఆదివారం బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి ఇస్నాపూర్ వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలో మహిళలతో కలిసి నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దారని, సంక్షేమం–అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. పేదల కోసం



అమలైన అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని, త్వరలోనే చరమగీతం పాడటం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఆటో కార్మికులు, మహిళలు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి... ఎంపీని కోరిన శివ్వంపేట ప్రెస్ క్లబ్

• రైల్వే జీఎంతో మాట్లాడిన ఎంపీ

**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** బ్రాహ్మణపల్లి రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావును శివ్వంపేట ప్రెస్ క్లబ్ బృందం ఆదివారం విజ్ఞప్తి చేసింది. అందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందించారు. వివరాల్లోకి వెళ్తే శివ్వంపేట మండలం శభాష్ పల్లి గ్రామానికి వచ్చిన ఎంపీ రఘునందన్ రావును ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొడ్డు రవి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ఆదివారం ప్రత్యేకంగా కలిసి సమస్యను చెప్పగా అందుకు ఎంపీ అక్కడికక్కడే దక్షిణ మధ్య రైల్వే రీజినల్ మేనేజర్ శ్రీవాత్సవ, డీజీఎం కిరణ్ కుమార్‌లతో ఫోన్‌లో మాట్లాడి, రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల విడుదల కోసం నెల రోజులలో ప్రణాళిక సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ నర్సాపూర్, గజ్వేల్ తాలూకాల ప్రజలు సంగారెడ్డి పట్టణానికి వెళ్లడానికి బ్రాహ్మణపల్లి రైల్వే గేటు వద్ద పై ఓవర్ బ్రిడ్జి లేక పోవడంతో ఎన్నోరకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వాలు బ్రిడ్జి గురించి కనీసం ఊసే ఎత్తకపోవడం బాధాకరం అన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోరుతూ శభాష్ పల్లితో పాటు పరిసర గ్రామపంచాయతీల నుండి తీర్మాణాలను దక్షిణ మధ్య రైల్వే అధికారులకు అందజేయాలనీ బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవిని ఆయన సూచించారు. తన హయాం లోనే బ్రాహ్మణపల్లి పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించి, ప్రారంభం సైతం చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు నటరాజ్ గౌడ్, ప్రధానకార్యదర్శి పోచగౌడ్, ముఖ్య సలహాదారులు మంగ్రాతి బాలేష్, కోశాధికారి బుర్ర మహేష్ గౌడ్, సమన్వయకర్త పల్లె వీరేష్, సభ్యులు వెంకటస్వామి, వజ్ర రాజు, అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.



## మల్కాపూర్‌లో బోనాల పండుగ



**తూప్రాన్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలైన పోచమ్మ, మహంకాళమ్మ, రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ, కనకదుర్గమ్మల కు అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు బోనాలు సమర్పించారు. శివసత్తులు శిగాలతో గ్రామం దద్దరిల్లిపోయింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, సరిత పరమేష్ , రేఖ నాగరాజుగౌడ్ ,మాజీ సర్పంచ్ స్వామి,ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నంగునూరు మండలంలో గ్రామదేవతలకు బోనాలు



**నంగునూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** నంగునూరు మండలంలోని కొండంరాజుపల్లి, ఖాత, గట్ల మల్యాల గ్రామాల్లో పోచమ్మ అమ్మవారికి, నంగునూరు గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారికి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల కుల సంఘాలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలను నెత్తిన ఎత్తుకుని మంగళహారతులు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతకంతో యువరైతు మృతి



**వెల్దుర్తి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** వెల్దుర్తి మండలం శేరీల గ్రామానికి చెందిన మిర్యపల్లి రఘుపతి వయస్సు 28 తన పొలం వద్ద గ్రాస్ కట్టర్ తో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు గడ్డి కోత మిషన్ విద్యుత్ తీగల కు తగలి రఘుపతి అక్కడికక్కడే మరణించడం జరిగింది మృతుడికి భార్య సునీత ఇద్దరు కూతుళ్లు ఉన్నారు రఘుపతి దినసరి కూలిగా జీవనాన్ని కొనసాగిస్తున్నారని కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో మృతిని బంధువులంతా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు ఘటనా స్థలానికి ఎస్ఐ కరుణాకర్ రెడ్డి చేరుకొని పంచనామా చేసి మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది

## వెయ్యి రోజుల పాలనలో పదేళ్లు వెనక్కి



**తూప్రాన్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో తెలంగాణ పదేళ్లు వెనక్కి వెళ్లిందని తూప్రాన్ మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ విమర్శించారు. బీఆర్ఎస్ ఆదేశాల మేరకు వార్డులో ఇంటింటికీ 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తూ ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు మంచి స్పందన ఉందని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిల్, కొత్త నర్సింలు, శ్రీకాంత్, నరేష్, హైమద్, శ్రీను, శేఖర్, లూకా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలు కల్పించాలి: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**శివ్వంపేట, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** పరిశ్రమ ఏర్పాటు చేయడమే కాదని పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గుండ్లపల్లిలో ఏర్పాటు చేసిన మణికంఠ ఎంటర్ ప్రైజెస్ చిన్నపాటి పరిశ్రమను దాని నిర్వాహకులైన మాజీ సర్పంచ్ పెంజర్ల శ్రీనివాస్ యాదవ్, హరీష్ యాదవ్, మహిపాల్ రెడ్డి, బోళ్ల సదానందంతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో చిన్నపాటి పరిశ్రమలతో స్వయం ఉపాధి పొందుతూ వారి వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నారు. దీంతో పలు కుటుంబాలకు ఉపాధి కల్పించిన మణికంఠ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్, ఆత్మ మాజీ చైర్మన్ గౌరి వెంకటరెడ్డి, సర్పంచ్ మమత నర్సింహాయాదవ్, నాగేశ్వర్ రావు, జగన్ రెడ్డి, కన్నారం దుర్గేష్, ఉప్పునూతల సత్యనారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జీ ఫీల్డ్ అసిస్టెంట్ల మండల కమిటీ ఎన్నిక



**మద్దూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మద్దూరు మండలంలో వీబీజీ రామ్‌జీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మున్నూరు కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా మొగులప్ప (నందిపాడు), ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్ (మోమినాపూర్), గౌరవాధ్యక్షుడిగా కుమారస్వామి (కాజీపూర్), కార్యదర్శిగా కనకప్ప (చెన్నూర్), కోశాధికారిగా తుల్జానాయక్ (చింతదిన్నె) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర మహా సభలకు తరలిన చేర్యాల నాయకులు



**చేర్యాల, సెప్టెంబర్ 06(జనంసాక్షి):** ఈ నెల 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరుగుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగవ మహా సభలకు చేర్యాల ప్రాంత నుంచి కార్మికులు తరలివెళ్లినట్లు ఆ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్ తెలిపారు. ఆదివారం చేర్యాల ప్రాంతం నుండి కరీంనగర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 6న కార్మిక ప్రదర్శన, 7, 8 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో నల్ల చట్టాలను ముందుకు తీసుకువస్తుందని, ఆ చట్టాలను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదనే విధంగా తీర్మానాలు చేపడతామన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానానికి, స్కీమ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. తరలి వెళ్ళిన వారిలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కుడిక్యాల బాల్ మోహన్, వలబోజు నరసింహ చారి, కాశబోయిన చరణ్, సాయి రెడ్డి, మల్లేశం, నరసింహులు, మానస, లక్ష్మి, ఎల్లవ్వ, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన



**మాసాయిపేట, సెప్టెంబర్ 6 (జనం సాక్షి):** మాసాయిపేట రైతు వేదిక, స్థానిక ఎరువుల దుకాణాల వద్ద రైతులకు 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్' (FFS) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్‌పై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. యాప్‌లో యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ లేదా ఫార్మర్ ఐడీ, OTPతో లాగిన్ కావాలని సూచించారు. భూమి, పంట వివరాల ఆధారంగా అవసరమైన ఎరువుల పరిమాణాన్ని యాప్ చూపిస్తుందని వివరించారు. బుకింగ్ అనంతరం QR కోడ్, బుకింగ్ ఐడీ వస్తాయని, 48 గంటల్లో ఎరువులు తీసుకోవాలని తెలిపారు.
కొనుగోలు చేసిన 15 రోజుల తర్వాతే మళ్లీ బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గతంలో యూరియా తీసుకున్న రైతులు సంయమనం పాటించి ఇతర రైతులకు కూడా అందేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.కవిత, ఏఈఓ భార్గవ్ గౌడ్, ఆత్మ ఏటీఎం నరేందర్, రైతులు పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌లో విజయోత్సవ వికాస యాత్ర



**నర్సాపూర్ సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వం 1,000 రోజుల పాలనను పురస్కరించుకుని నర్సాపూర్ పట్టణంలో సోమవారం విజయోత్సవ వికాస యాత్ర నిర్వహించనున్నట్లు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని శ్రీ మల్లన గుడి నుంచి ప్రారంభమయ్యే యాత్ర నర్సాపూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రామాయంపేట నియోజకవర్గ ఏర్పాటుకై జర్నలిస్టుల దీక్ష



**నిజాంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** గతంలో రామాయంపేట నియోజకవర్గం ఉండేదని, మళ్లీ నియోజక వర్గాన్నీ ఏర్పాటు చేయాలని నిజాంపేటలో ఆదివారం మండల జర్నలిస్ట్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రామాయంపేట నియోజకవర్గంగా ఏర్పడితే అన్ని మండలాలు అభివృద్ధి చెందుతాయని, 1952 నుంచి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందన్నారు. అదేవిధంగా మళ్లీ రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షకు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మండల అధ్యక్షులు సిద్దారాం రెడ్డి అలాగే బీఆర్ఎస్వి మండల అధ్యక్షుడు రంజిత్ గౌడ్‌లు, మావురం రాజులు సంఘీభావం తెలిపారు. మళ్లీ రామాయంపేటను నియోజక వర్గంగా ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్ట్‌లు బండారి చంద్రం, సంజీవ్, సిద్దరాములు, బాలరాజు తదితరులు ఉన్నారు.

## ఇది 420 ప్రభుత్వం... ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**శివ్వంపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ 420 ప్రభుత్వమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె శివంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో పర్యటించి, కాంగ్రెస్ ఎన్నికల గ్యారెంటీ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1000 రోజులుగా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. ప్రజలకు రేవంత్ సర్కార్ 33 నెలలుగా ఆసరా పెన్షన్లు, మహిళలకు నెలకు రూ.2500, రైతుభీమా, విద్యార్థులకు స్కూటీలు, వికలాంగులకు రూ.6 వేలతో కలిపి ప్రతి పథకం ఎగకొట్టి, ప్రజలను నిలువైన మోసం చేసిందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్ సర్కార్ ప్రజలలో పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయిందని, హామీలను అమలు చేసేదాకా కెసిఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని ఎమ్మెల్యే ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్,మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, సర్పంచులు నారాయణరావు, బ్యాగరి నర్సయ్య, ఆకుల కుమార్, పార్టీ ప్రధానకార్యదర్శి టీ. రాజశేఖర్ గౌడ్, రాజేందర్ నాయక్, ఎం.లక్ష్మీనర్సయ్య, బోళ్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ పాపయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎర్రకుంట వేణుగోపాల్, గ్రామ అధ్యక్షుడు కందుల బాల్‌రాజు, కన్వీనర్ పేర్ల సత్తయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బాపూజీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకుడు



**రేగోడ్, సెప్టెంబర్06 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న విధానాలను నచ్చక కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సమక్షంలో కండువా కప్పుకుని పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని రేగోడ్ మండల పరిధిలోని కొండాపురం రాజు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కేసిఆర్ చేసిన అభివృద్ధి పనులను కు ఆకర్షితులై కెసిఆర్ చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ విఫలమైందని అన్నారు.

# ప్రజాసేవలో ముందంజలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** మెదక్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ అన్నదాన కార్యక్రమాలు, పేద కుటుంబాల వివాహాలకు ఉచితంగా ముహూర్త సామగ్రి అందించడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**రైతుల సమస్యలపై పోరాటం...**

రైతుల సమస్యల పరిష్కారంలోనూ తిరుపతిరెడ్డి ముందుంటున్నారు. యూరియా కొరత, రుణమాఫీ, భూభారతి తదితర సమస్యలపై మెదక్ పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేస్తున్నారు.

**అన్ని వర్గాలతో మమేకం...**

ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామ్యం అవుతూ అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆలయాలు, చర్చిలు, ఈద్గాల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటూ సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహిస్తున్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ నిత్యం అందుబాటులో ఉంటున్న తిరుపతిరెడ్డి ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో ఆయనను మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఎన్నుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

## అంబరాన్నంటిన గణనాథుని ఆగమన వేడుకలు



**సదాశివపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** వినాయక చవితి ఉత్సవాలకు సుమారు 12 రోజుల ముందే సదాశివపేటలో గణేష్ వేడుకల సందడి మొదలైంది. వీర్ శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ గణనాథుని విగ్రహాన్ని పట్టణానికి తీసుకువచ్చి ఘనంగా ఆగమన వేడుకలు నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు పట్టణ ప్రజలు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కోట ప్రాంతం జనసంద్రంగా మారింది.

విద్యుత్ కాంతుల అలంకరణలు, డీజే సౌండ్ మధ్య సాగిన ఆగమన భక్తుల నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో యువత ఉత్సాహంగా పాల్గొంది. ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## నూతన వస్త్రధారణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్



**నాగల్గిద్ద, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** హైదరాబాద్ శంకర్‌పల్లిలో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం మైకోడ్ గ్రామానికి చెందిన ఓంకర్ కూతురి కుమారుడు మరియు కుమార్తెల నూతన వస్త్రధారణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్ హాజరై చిన్నారిని ఆశీర్వదించి, నూతన వస్త్రధారణ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ శుభకార్యక్రమంలో ఆనంద, సంగమేశ్వర్, దుర్గయ్య, శ్రీకాంత్ స్వామి, రమేష్త, ప్రశాంత్ తదితరులు పాల్గొని చిన్నారికి ఆశీర్వాదాలు అందించారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి?

- **ఆరు గ్యారెంటీలు... ఇచ్చినా హామీల అమలేది?**
- **సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి**
- **మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**





**బెజ్జంకి,సెప్టెంబర్ 6(జనంసాక్షి):** మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు.ఆరు గ్యారెంటీలు,420 హామీలను నెరవేర్చడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజా సమస్యలపై పెద్దఎత్తున హామీలు ఇచ్చిందని,1000 రోజుల పాలన పూర్తయిన తర్వాత ఎన్ని హామీలు అమలు చేశారో,ఎన్ని సమస్యలు పరిష్కరించారో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని రసమయి డిమాండ్ చేశారు.ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతులు, మహిళలు, వికలాంగులు, నిరుద్యోగులు, పేదల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న పార్టీనే ప్రజా సమస్యలపై నిరసనలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు.రేవంత్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా రాజకీయ విమర్శలకు పరిమితమవుతోందని విమర్శించారు. మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రహదారి సమస్యలను తక్షణమే పరిష్కరించి,పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు,రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, సర్పంచులు బొల్లం శ్రీధర్, పెద్దన్న, తాళ్లపెల్లి భీమయ్య, ఎర్రవెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ లింగాల నిర్మల లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ కనగండ్ల కవిత తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చు చంద్రకళారాజయ్య, సర్పంచులు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

### పిల్లర్లకే పరిమితమైన

## రూ.1.60 కోట్ల శంకుస్థాపన?



**జోగులాంబ గద్వాల, ప్రతినిధి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** లైబ్రరీలక్షలు పోసి ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేని పేద విద్యార్థులకు గ్రంథాలయాలే ఏకైక దిక్కు. కానీ జోగులాంబ గద్వాల జిల్లాలో పరిస్థితి దారుణంగా మారింది. 2021లో రూ.1.60 కోట్లతో శంకుస్థాపన చేసిన గద్వాల నూతన లైబ్రరీ భవనం.. బిల్లులు రాక పిల్లర్ల స్థాయిలోనే ఆగిపోయింది. ఇంటర్నెట్, కంప్యూటర్లు, ఇన్వర్టర్లు లేక కనీసం తాజా నోటిఫికేషన్ పుస్తకాలు దొరక్క నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు.హామీల వర్షం కురిపించే పాలకులు, నిరుద్యోగుల భవితవ్యం విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ నిర్మాణం పాలకుల చిత్తశుద్ధికి నిలువుటద్దంగా మారింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వేలాది మంది గ్రామీణ విద్యార్థులు కూర్చోవడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం శంకుస్థాపనల ఆర్భాటాలకే పరిమితమై, ఆ తర్వాత పనుల పురోగతిని గాలికొదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి, తక్షణమే నిధులు మంజూరు చేసి భవనాన్ని పూర్తి చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘోర ప్రమాదం.. ఇద్దరు అక్కడికక్కడే మృతి!



**ఎర్రవల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** గద్వాల్ జిల్లా ఎర్రవల్లి మండలం పరిధిలోని ఎన్ హెచ్ -44 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై హెచ్‌పి పెట్రోల్ పంప్ వద్ద నిలిపి ఉంచిన లారీని, హైదరాబాద్ నుంచి గద్వాల్ వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మౌనిక, సాయికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారును ముఖేష్ అనే డ్రైవర్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు మృతదేహాలను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కళ్లముందే ఇద్దరు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం అలుముకుంది. చేతికి అందివచ్చిన యువతీయువకులు ఇలా రోడ్డు ప్రమాదంలో విగతజీవులుగా మారడం చూసి స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదిస్తున్నారు. క్షణాల వ్యవధిలో జరిగిన ఈ ఘోర దుర్ఘటన ఆయా కుటుంబాల్లో ఎనలేని చీకట్లను నింపింది.

## ఫాంపాండ్ గుంతలో పడి వ్యక్తి మృతి



**మిడ్జిల్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మసిగుండ్లపల్లి గ్రామ శివార్లలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు అదే గ్రామానికి చెందిన కటిక ఈశ్వరయ్య పొలంలో ఫాంపాండ్ (వ్యవసాయ పొలంలో నీరు నిల్వ ఉండేందుకు చేసుకున్న కుంట) గుంతలో పడి వ్యక్తి మరణించారు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన వడ్ల శ్రీనివాసులు (42) అనే వ్యక్తి ఉదయం సుమారు 8:00 గంటల సమయంలో స్నానం చేయడానికి గ్రామ శివారు లో ఉన్న ఫాంపాండ్ గుంత వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి లోతైన గుంతలో పడిపోయారు. మృతునికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోవడంతో ఆయన అక్కడికక్కడే శ్వాస ఆడక మృతి చెందారు. గ్రామ పెద్దల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు. ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శ్రీనివాసులు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

### కర్ణాటకలో ప్రశంసలు

## అందుకున్న నడిగడ్డ కోలాటం..

• రాయచూరు ఎమ్మెల్యే అభినందన



**గద్వాల్, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్న నడిగడ్డ జడ కోలాటం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటి కర్ణాటకలోనూ ప్రశంసలు అందుకుంటోంది. గద్వాల ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందిన జడ కోలాట కళారూపం.. కనుమరుగవుతున్న తరుణంలో కళాకారులు దానిని పరిరక్షిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని కర్ణాటకలోని రాయచూరు జిల్లా మర్చెటాల్, బిజనగెర గ్రామాల్లో శనివారం రాత్రి ప్రత్యేక కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.ఈ వేడుకల్లో దేవబండకు చెందిన ప్రముఖ కోలాటం మాస్టర్ శివకుమార్ బృందం అపూర్వ ప్రతిభ కనబరిచింది. లయబద్ధమైన అడుగులు, జడలతో చేసే విన్యాసాలు, భక్తి గీతాలతో కూడిన వారి ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.ప్రదర్శన అనంతరం రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పటేల్ కోలాటం బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. "కనుమరుగవుతున్న ఇలాంటి జానపద కళలకు జీవం పోయడం ఎంతో అభినందనీయం. నడిగడ్డ కళాకారుల ప్రతిభ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాలి" అని ఆయన కొనియాడారు.

కళాకారులను సత్కరించి నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ శివకుమార్ మాట్లాడుతూ తమ కళకు కర్ణాటకలో లభించిన ఆదరణ మరింత ఉత్సాహాన్నిచ్చిందని తెలిపారు.

### వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో

## జర్నలిస్టులకు ఘనంగా సత్కారం..



**మక్తల్, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని సత్యసాయి ఆలయంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో పత్రికా విలేకరులను ఘనంగా సత్కరించారు. వనితా క్లబ్ అధ్యక్షురాలు ప్రసన్న నేతృత్వంలో... వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు కేసీ గుప్తా జన్మదిన వారోత్సవాల్లో భాగంగా... జర్నలిస్టులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ... సమాజంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా,సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. సీనియర్ జర్నలిస్టులు మామిళ్ల పృథ్వీరాజ్, అంబాదాస్, గోవిందు, సురేశ్ గౌడ్, రఘు, సురేష్, ప్రదీప్ కుమార్, హరికృష్ణ, కార్తీక్ సన్మానం అందుకోగా.. కార్యక్రమంలో వనితా క్లబ్ సభ్యులు స్వాతి, వాసవీ మహిళా సంఘం మాజీ అధ్యక్షురాలు మనసాని సరళ తదితరులు పాల్గొన్నారు.

## గోడలపై ప్రచారాలు.. వీధుల్లో చెత్త కుప్పలు..



**జడ్చర్ల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత నినాదాలు కేవలం ప్రచార బోర్డులు, గోడల రాతలకే పరిమితమవుతున్నాయనడానికి ఈ చిత్రమే ప్రత్యక్ష నిదర్శనం. కావేరమ్మపేటలోని అత్యంత ముఖ్య కూడలి అయిన గ్రామ చావడి ప్రాంగణంలో, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ముందే పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తోంది. పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి వాహనానికి ఇవ్వండి" అంటూ పురపాలక సంఘం (జడ్చర్ల - కావేరమ్మపేట) విస్తృతంగా రాసిన ప్రచార గోడల కిందే చెత్త కుప్పలు పేరుకుపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. నిత్యం ప్రజల రాకపోకలతో సందడిగా ఉండే ముఖ్య కూడలిలోనే ఇలా చెత్త వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతూ పరిసరాలు తీవ్రంగా అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీనివల్ల ఈగలు, దోమలు వ్యాపించి ప్రజారోగ్యం క్షీణించే ప్రమాదం పొంచి ఉంది. దేశ నాయకుడి విగ్రహం, చారిత్రక గ్రామచావడి ఉన్న ప్రాంతంలోనే ఇలాంటి అధ్వాన పరిస్థితి నెలకొనడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు కేవలం గోడల రాతలకే పరిమితం కాకుండా, వెంటనే స్పందించి ఆ ప్రాంగణంలోని చెత్తను తొలగించి, నిరంతరం శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### కొత్తపల్లి రోడ్ల

## అభివృద్ధికి రూ.59.30 కోట్ల నిధులు మంజూరు



**కొత్తపల్లి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి పనులకు మొత్తం రూ.59.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

మద్దూరు నుంచి గోకుల్‌నగర్ వరకు రహదారి నిర్మాణానికి రూ.51 కోట్లు, లింగాలచేడు నుంచి షేర్ వెంకటాపూర్ వరకు రహదారి అభివృద్ధికి రూ.6.50 కోట్లు, కొత్తపల్లి చౌరస్తా నుంచి ఐఎంటీసీ భవనం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీ అభివృద్ధి పనులు పూర్తయితే మండల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. నిధులు మంజూరు చేయడంపై స్థానిక ప్రజలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపల్లి మండల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, మండల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకరించాలని కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సి.భారతి ఎంపిక

• రేవల్లిలో హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు



**రేవల్లి, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సి. భారతి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వినూత్న బోధనా పద్ధతులను అవలంబిస్తూ, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు ఆమె ఈ గౌరవానికి ఎంపికయ్యారు. విద్యార్థుల్లో కేవలం పాఠ్యాంశాలే కాకుండా సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు ఆమెను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం రేవల్లి మండలానికి గర్వకారణమని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమం - సీఐ రామ్‌లాల్



**మక్తల్, సెప్టెంబరు 6 (జనంసాక్షి):** కోర్టులలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్‌లాల్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన మక్తల్, నారాయణపేట కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మక్తల్ సర్కిల్ పరిధిలోని మక్తల్, ఊట్కూరు, మాగనూరు, కృష్ణా పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ట్రాఫిక్ చలాన్లు, కేసులు. లోక్ అదాలత్‌లో ఇరువర్గాల ఆమోదంతో తీసుకునే నిర్ణయాలకు కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని, దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మనశ్శాంతి లభిస్తుందని సీఐ పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని గుర్తు చేస్తూ, కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులను గానీ, న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించాలని కోరారు.

### కాంగ్రెస్ పార్టీ మోసాలను నిరసిస్తూ
## అంబేద్కర్ విగ్రహాలకు బిఆర్ఎస్ పార్టీ వినతులు

**కొండపాక, అక్టోబర్ 6 (జనంసాక్షి):**



కొండపాక మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు ప్రభుత్వం వచ్చి1000 రోజులైనా ఇంతవరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయింది ఇచ్చిన హామీలు అమలు చేయాలని బి ఆర్ఎస్ పార్టీ తరఫున మండల మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్ వివిధ గ్రామాల కొండపాక, దుద్దెడ తదితరగ్రామ శాఖ అధ్యక్షుడులు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను గ్రామస్తులకు వివరిస్తూ బాకీ కార్డులను పంపిణీ చేయడం మండల అధ్యక్షుడు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సంకల్ప సభకు
## హైదరాబాద్‌కు బయలుదేరిన ఉపాధ్యాయులు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 6(జనంసాక్షి);**
ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టిజిఇజెఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఉద్యోగుల సంకల్ప సభకు జోగులాంబ గద్వాల జిల్లా నుండి ఎస్‌జిటియు జిల్లాశాఖ తరలివెళ్లింది. పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలనీ,ఉద్యోగులకు పిఆర్సి నీ తక్షణమే అమలు చేయాలనీ, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలనీ,10,000 పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలనీ,జీవో నెంబర్ 25 ను సవరించి ఉపాధ్యాయులపై ఉన్న భారాన్ని తగ్గించాలనీ, పిఆర్సి లో ఎస్జీటీలు, ఎస్.ఏ లకు మధ్య ఉన్న వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలనీ,ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం త్వరగా నెరవేర్చాలని ఎస్ జి టి యు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు తరికి గోపాల్, జనరల్ సెక్రటరీ బి .వినోద్ కుమార్ అన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం తల్లి బిడ్డ క్షేమం

- **జిల్లా ప్రజలు అత్యవసర 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి**
- **జిల్లా మేనేజర్ : ఉదయ్ కుమార్ (ఇంచార్జ్)**

**కృష్ణ, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**



నారాయణపేట జిల్లా కృష్ణ మండలం 108 అంబులెన్స్ లో ఓ మహిళ శిశువుకు జన్మనిచ్చిన ఘటన శని వారం కృష్ణ మండల కేంద్రంలో జరిగింది. గుడెబలూరు గ్రామానికి చెందిన చట్టే నందిని రెండవ కాన్పు నిమిత్తం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబస భ్యులు తక్షణమే మాగ నూరు 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరు కొని,గర్భిణీ స్త్రీని మాగ నూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాని కి తరలిస్తున్న క్రమంలో,మార్గమధ్యలో నల్లగట్టు మారెమ్మ స్టేజి శివారులో టెక్నీషియన్ వెంకటేష్ "ఈ ఆర్ సి పి "డాక్టర్ శివ సూచనలతో అంబులెన్స్ లోనే ప్రసవం చేశారు. అనంతరం నవజా త మగ శిశువుకు తగు పరిచర్య లు చేస్తూ మాగ నురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీ లించి తల్లి,బిడ్డ క్షేమమని తెలిపారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఆపద్భాంధవులుగా చాకచక్యంగా,సమయస్ఫూర్తితో వ్యవహరించి, తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడిన 108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ అనిల్, టెక్నీషియన్ తిరుపతి లను కుటుంబసభ్యులు,ఆస్పత్రి వైద్యులు అభినందించారు.

## తరగతి గదులకు భూమిపూజ

**పాపన్నపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**



ప్రభుత్వ బడిలో అదనపు తరగతి గదుల పనులను దాత సహకారంతో శ్రీకారం చుట్టారు. పాపన్నపేట లోని (సీపీఎస్) ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత కీర్తిశేషులు మన్నే ఈశ్వరయ్య,మన్నే శాంతమ్మ గార్ల జ్ఞాపకార్థం వారి కుమారుడు,కోడలు శాస్త్రవేత్త ఉపేందర్, వందనల ఆర్థిక సహకారంతో ఈపనులు జరగ నున్నాయి.
ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోద,ఉపాధ్యాయురాలు ఉమాదేవి,ట్రస్టు సభ్యులు కైలాస రాజేశ్వర్,పాఠశాల చైర్మన్ శ్రీరాం భవాని,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

**కొల్చారం, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కొల్చారం మండలం చిన్నఘనపూర్‌లో సర్పంచ్ చందాపురం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు, భక్తులకు సౌకర్యాలు, విగ్రహాల నిమజ్జనం, భద్రత, రవాణా, విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు.
ముఖ్య అతిథిగా హాజరైన కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో యువత బాధ్యతగా వ్యవహరించి, ప్రశాంతంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. గ్రామంలో



ఐక్యత, భక్తిభావంతో ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చర్చించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మహేష్, ఉపసర్పంచ్ అంకమ్మ నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ మంద నాగయ్య, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### న్యూమరాలజీలో
## విశిష్ట సేవలకు శిక్షారత్న అవార్డు

**ఆత్మకూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**




హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలోని హరి యూనివర్సిటీలో ఉపాధ్యా య దినోత్సవం సందర్భం గా శిక్షారత్న అవార్డు మహో త్సవం ఘనంగా నిర్వహించారు. సూపర్ ఏఐ అకాడమీ, ఆదాబ్ హైదరాబాద్, స్టడీ నైన్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులను సత్కరిం చారు. న్యూమరాలజీ రంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ ఎల్.వి. రమేష్ నాయక్‌కు శిక్షారత్న అవార్డుకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ గుర్తింపు అమరచింత గ్రామానికి గర్వకారణమని గ్రామ ప్రజలు, అభి మానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ రమేష్ నాయక్ కు అభినందనలు తెలిపారు.

### టియుడబ్ల్యూ
## జేఈసీ మెంబర్ గా నీలి శ్రీకాంత్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 6 (జనం సాక్షి):**



సంగారెడ్డి జిల్లా టీయుడబ్ల్యూ జే (ఐజేయు) ఈసీ మెంబర్ గా సదాశివపేట పట్టణానికి చెందిన నీలి శ్రీకాంత్ ను నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు పైసల్ అహ్మద్, జిల్లా అధ్యక్షులు బందారు యాదగిరి తెలిపారు. ఆదివారం నారాయణఖేడ్ లో జరిగిన టియుడబ్ల్యూ జే (ఐజే యు) నియోజకవర్గ సమావేశంలో ఈ మేరకు శ్రీకాంత్ ను నియమించినట్లు ప్రకటించారు.
కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, సదా శివపేట తాలూకా అధ్యక్షులు ఎండి హాజీ, నాయకులు శివ కుమార్, సిద్దు జైన్ ఉన్నారు.

### వర్కూర్‌లో నూతన
## సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



**మాగనూర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** వర్కూర్ గ్రామంలో నూతన సీసీ కెమెరాల ఏర్పాటుకు బీరప్ప గుడి కాంట్రాక్టర్ యు.వెంకటరమణ బట్ ఉడిపి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. మాగనూర్ ఎస్సై అశోక్‌బాబు, మక్తల్ సీఐ రాంలాల్ సూచనల మేరకు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తహసీల్దార్ ఎం.ఏ. రహమాన్ సమక్షంలో విరాళాన్ని గ్రామ సర్పంచ్ బైనీ లక్ష్మన్నకు అందజేశారు. సీసీ కెమెరాలతో గ్రామ భద్రత పటిష్టం కావడంతో పాటు నేరాలు, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా పెట్టవచ్చని అధికారులు తెలిపారు. ఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేం దుకు కెమెరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నిర్మల మల్లారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు శంకరోల రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాలల రోస్టర్ పాయింట్ సవరించాలి

- **హక్కుల సాధన కోసం నేడు మెదక్ కలెక్టరేట్ వద్ద ధర్నా**

**కొల్చారం, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):**
మాలల రోస్టర్ పాయింట్‌ను సవరించి తమ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ నేడు మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మాలల ధర్నా నిర్వహించనున్నట్లు మాలల జేఏసీ చైర్మన్ జెల్ల సుధాకర్, జేఏసీ కో-చైర్మన్ కల్లూరి సంజీవ తెలిపారు.
"మాలల రోస్టర్ పాయింట్ సవరించు.. మాలల హక్కులు సాధించు" అనే నినాదంతో ఉదయం 10:30 గంటలకు ధర్నా కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మాలల హక్కుల కోసం చేపడుతున్న ఈ కార్యక్రమానికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## చీపుర్లు పట్టి.. రోడ్లు ఊడ్చి.. బిఆర్ఎస్ వినూత్న నిరసన

**పెబ్బేరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**
మున్సిపల్ ప్రజాప్రతినిధులు అధికారులకు స్థానిక సమస్యలు కని పించడం లేదా అంటూ బిఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పెబ్బేరు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చారు. పట్టణ సమస్యలు గాలికొదిలేశారంటూ స్థానిక సుభాష్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన చేశారు. కాలనీల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అటకెక్కిందని వాపోయారు. కాలువల్లో మురుగు పేరుకు పోయినా తీసేవారు లేరని అన్నారు. ఇక ప్రధాన రోడ్లు, కాలనీల్లో స్తంభాలకున్న లైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదని, అవి మరమ్మతు లకు చేరినా రిపేర్లు చేయించేందుకు కూడా ప్రజాప్రతినిధులు ముందుకు రావడంలేదని చెప్పారు. కాలనీల్లో ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నా ఫాగింగ్ సరిగ్గా చేయడం లేదని అన్నారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో సైతం పాలకవర్గం విఫలమయ్యారని మండిపడ్డారు. వెంటనే



మున్సిపల్ చైర్మన్ స్పందించి పాలకవర్గంతో చర్చించి ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలరు హరిశంకర్ నాయుడు, మండల అధ్యక్షుడు వనం రాములు, నాయకులు కర్రెస్వామి, సహదేవుడు, విశ్వరూపం, చిన్న ఎల్లా రెడ్డి, సాయినాథ్, వడ్డె రమేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్‌లో మినరల్ లిక్విడ్ పిచికారీ



**కొల్చారం, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కొల్చారం మండలం తుక్కాపూర్‌లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దొడ్ల అంజ నేయులు ఆధ్వర్యంలో ప్రధాన వీధులు, పరిసర ప్రాంతాల్లో మినరల్ లిక్విడ్ పిచికారీ చేశారు. దుర్వాసన, దోమలు, ఇతర కీటకాల సమస్య లను నియంత్రించడంతో పాటు ప్రజలు, పశువులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. పారిశుద్ధ్య చర్యలను నిరంతరం కొనసాగిస్తా మని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ ఆరె రవీందర్, కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యు లు, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయమే గురువులకు గర్వకారణం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల సూచించారు. కల్వకుర్తి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూని యర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఉపాధ్యాయులకు శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, అపజయాలకు భయపడకుండా పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల విజయమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాలలోని వాతావరణం, క్రమశిక్షణ, సౌకర్యాలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.స్వరూప, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**నారాయణపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** నారాయణపేటవారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ ,ఎస్ ఎస్ సి,జి డి ఆర్మీ విద్యార్థిని, విద్యా ర్థులందరికీ ఆదివారం ఉచిత మెడికల్ చెక్అప్ క్యాంప్ నిర్వహించారు.

దంత వైద్య పరీక్షలుడెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ వినయ్ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు.కంటి పరీక్షలుఅదేవిధంగా డాక్టర్ మల్లికార్జున విద్యా ర్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరం వారియర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ లయన్ రవికుమార్ గౌడ్, డైరెక్టర్ లయన్ డాక్టర్ అంజనే యులు (ఆర్మీ) ఆధ్వర్యంలో విజయవం తంగా నిర్వహించారు.

మా అకాడమీ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, తమ విలువైన సమయాన్ని కేటాయించి ఉచితంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ వినయ్, డాక్టర్ మల్లికార్జునకు వారియర్స్ డిఫెన్స్ అకాడ మీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ లయన్ శాంత, అకాడమిక్ ఇన్‌చార్జ్, కోచ్ లయన్ ఎస్. చక్రవర్తి,,లెక్చరర్స్ శ్రీనివాసులు, జాఫర్ ,రాజ్ కుమార్, వెంకటరమణ, లక్ష్మణ్ , సురేందర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే..

- భవిత కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




**సదాశివపేట, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది ఇంటర్మీడియేట్‌లోని రెండేళ్లే నని భవిత కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం సదాశివపేటలోని ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో భవిత కళాశాల ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రెండేళ్ల కష్టపడి, ఇష్టపడి చదివితే ఉన్నత విద్యపై ఆసక్తి పెరగడంతో పాటు మంచి భవి ష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. 2026లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థు లను భవిత కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజు, శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గద్వాల కబడ్డీ ఖ్యాతిని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన జయకృష్ణ



**జోగులాంబ గద్వాల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి అండర్-16 పురుషుల కబడ్డీ అకాడమీ ఎంపికలు జూలై 25, 26 తేదీల్లో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 20 మందిని అకాడమీకి ఎంపిక చేశారు. వారిలో గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కె. జయకృష్ణ చోటు దక్కించుకున్నాడు. దీంతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షురాలు డీకే. స్నిగ్ధారెడ్డి జయకృష్ణను సన్మానించారు. ఈ నెల 7 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే శిక్షణకు హాజరవుతాడని కార్యదర్శి కబడ్డీ నరసింహ తెలిపారు. జయకృష్ణ విజయం గ్రామీ ణ క్రీడా ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ బాకీ తీర్చాలంటూ బిఆర్ఎస్ వినూత్న నిరసన

- కాంగ్రెస్ చేతిలో మోసపోయిన తెలంగాణ.. పుట్ట రాంరెడ్డి



**వెల్దండ, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి అన్నారు.బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాలు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ పిలుపుమేరకు మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్యలతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రదర్శిస్తూ, డబ్బులు చాటిస్తూ, వీధి వీధి తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు 2500, రైతు భరోసా, తులం బంగారం, విద్యార్థినిలకు స్కూటీలు, విద్యార్థులకు స్కాలర్షి పులు వంటి బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నిరంజన్ ,లింగం, సీనియర్ నాయకులు ప్రభాకర్, యువకులు పాల్గొన్నారు.

## కేసీఆర్, హరీష్‌రావు అవినీతి వల్లే నీళ్ల కరవు



**నంగునూరు, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం, హరీష్‌రావు అవినీతి వల్లే తెలంగాణలో నీళ్ల కరవు ఏర్పడిందని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, భగీరథ పనుల్లో కమిషన్ల కోసం నాసిరకం పనులు చేయడంతో ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని ఆరోపించారు.

వ్యవసాయానికి ప్రభుత్వం సరిపడా విద్యుత్ అందిస్తున్నా హరీష్‌రావు సబ్‌స్టేషన్ల సందర్శనల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకే 22ఏ జాబితా రూపొందించామని, పొరపాటున అందులో చేరిన సామాన్యుల భూములను త్వరలో సరిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో హామీలపై బీఆర్ఎస్ ఫిర్యాదులు

**గండీడ్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫ లమైందని ఆరోపిస్తూ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అర్హులైన లబ్ది దారులతో ఫిర్యాదులు చేయించాలని బీఆర్ ఎస్ నాయకత్వం పిలుపునిచ్చింది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి గండీడు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనా లని సూచించారు.

ఉదయం 10 గంటలకు ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో జరిగే ప్రజావాణికి పింఛన్లు అందని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సాయం అందని లబ్ధిదారులను తీసుకురావాలని కోరారు. రైతుబంధు, రైతు భరోసా అందని రైతుల సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచిం చారు. పింఛన్ల రెట్టింపు, రైతుభరోసా పెం పు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రూ.2లక్షల రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, ఆడపిల్లలకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2,500 సాయం వంటి హామీ లను కాంగ్రెస్ అమలు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. ప్రజావాణి ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది.

## డాక్టర్ చదువు కోసం పేదింటి బిడ్డ స్వేరో ఆర్థిక చేయూత కోసం ఎదురుచూపు

- పేదరికం అతని కలలను ఆపలేకపోయింది
- కష్టాలు అతని పట్టుదలను తగ్గించలేకపోయాయి




**కోహెడ, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** చివరకు నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించాడు. కోహెడ మండల కేంద్రానికి చెందిన వేల్పుల ప్రదీప్. ఇతడు హుస్నాబాద్ గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురుకులంలో చదువుతూనే గురుకుల ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందిస్తూ తనలోని సామాజిక బాధ్యతను చాటుకున్నాడు. నేడు అతని చదువుకు మన సహాయం అవసరమైంది. ఎంబిబిఎస్‌లో చేరేందుకు అతనికి 27వేల రూపాయల డీడీ చెల్లించాలి. ఇతర ఖర్చులతో కలిపి సుమారు రూ.2లక్షలు అవసరం ఉందని ఆయన పత్రిక ముఖంగా వేడుకొనుచున్నాడు. మీరు ఇచ్చే రూ.100, రూ.500, రూ.1,000 నా వైద్య చదవు కలకు ఒక అడుగు ముందుకు వేయిస్తుంది. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదని పలువురు కోరుతున్నారు. మన లో ప్రతి ఒక్కరం మనకు సాధ్యమైనంత సహా యం చేసి ఈ పేదింటి విద్యార్థిని వైద్యుడిగా నిలబెట్టుకుందాం. గూగుల్ పే నంబర్ 80 74053681వేల్పుల ప్రదీప్ తండ్రి స్వామి. గ్రామం, మం.కోహెడ, జిల్లా.సిద్దిపేట

## చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి



**మల్దకల్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఉలిగేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పెద్ద నరసింహులు (60) ఆదివారం కర్నూల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత వారం రోజుల క్రితంద్విచక్ర వాహనం వాహనం నడుపుతూ తృటి తప్పి కింద పడి గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారులు ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియలు సోమవారం ఉలిగేపల్లి గ్రామంలో జరుగుతాయి.

# మల్లేశ్వరం అభివృద్ధికి రూ.48 కోట్లు





**కొల్లాపూర్/నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** నల్లమల అడవుల మధ్య ప్రకృతి అందాలతో అలరారుతున్న మల్లేశ్వరం గ్రామాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో గుర్తింపు తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని గ్రామ సర్పంచ్ మదగం శిరీష తెలిపారు. హైలాండ్ పెద్దగుట్ట ప్రాంతంలో పర్యాటకులకు అవసరమైన క్యాటేజీలు, ఇతర సౌకర్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.48 కోట్ల నిధులు మంజూరు చేయడం గ్రామానికి గర్వకారణమన్నారు.

మల్లేశ్వరం ప్రాంతానికి ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారని, క్యాటేజీలు, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రజా పాలన ప్రభుత్వానికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**బీఆర్ఎస్‌పై విమర్శలు...**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని సర్పంచ్ విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను గత ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అభివృద్ధి పేరుతో భారీగా అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారో ఆ పార్టీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సంక్షేమానికి ప్రాధాన్యం...**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మదగం శిరీష అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సదుపాయం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ ద్వారా పేదలు, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, పర్యాటక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మల్లేశ్వరం అభివృద్ధి పనులు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లోనే చేపట్టిందని, రాబోయే రోజుల్లో మల్లేశ్వరాన్ని మరింత సుందరమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని సర్పంచ్ మదగం శిరీష కోరారు.



## శ్రీశైలం హైవేపై టిప్పర్ బోల్తా

- అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లిన వాహనం

**ఉప్పునుంతల (జనంసాక్షి):** శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై గ్రావెల్ (కంకర) లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో టిప్పర్ రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. ఘటనతో కొద్దిసేపు వాహనదారుల్లో ఆందోళన నెలకొంది.

సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? అనే విషయంపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. శ్రీశైలం–హైదరాబాద్ హైవేపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని స్థానికులు కోరుతున్నారు.

## వల్లూరులో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



**జడ్చర్ల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని నిరసిస్తూ ఆదివారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఎన్నికల వేళ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వల్లూరు వీరేష్, మాజీ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా, ఉపాధ్యక్షులు శంకర్, సలామ్, యువ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**సదాశివపేట, సెప్టెంబరు 6(జనంసాక్షి):** సదాశివపేట పట్టణ పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేసి తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో ఆదివారం మధ్యాహ్నం క్రిస్టియన్ శ్మశానవాటిక వెనుక సర్వే నంబర్ 761లోని పాడుబడ్డ రేకుల షెడ్‌లో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని పట్టుకుని వారి నుంచి రూ.23 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. సదాశివపేట పట్టణ,మండల పరిధిలో అక్రమ జూదం, పేకాట, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై అప్పిరెడ్డిపల్లిలో నిరసన



**నారాయణపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సుభాన్‌రెడ్డి, విశ్వనాథ్, సంజీవ్‌రెడ్డి, అనిల్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, వికలాంగులకు రూ.6,000 ఆర్థిక సాయం అందిస్తామన్న హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఘన సన్మానం



**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** సమాజ సేవలో భాగస్వాములవుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులను వాసవి క్లబ్ గోల్డ్, వాసవి వనిత క్లబ్ గోల్డ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సేవా వారోత్సవాల్లో భాగంగా కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి వాసవి క్లబ్ గోల్డ్ అధ్యక్షులు ఆకుతోట రాఘవేందర్ అధ్యక్షత వహించారు. జర్నలిస్టులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

ముఖ్య అతిథులుగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు డి.మాధవరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ జర్నలిస్టు మల్యాల బాలస్వామి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమన్నారు. జర్నలిజం ప్రజల గొంతుకగా నిలిచి సమాజ అభివృద్ధికి దోహదపడే బాధ్యతాయుతమైన రంగమని పేర్కొన్నారు.

వాసవి క్లబ్ గోల్డ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వక్తలు ప్రశంసించారు. అవసరమైన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా భావాన్ని పెంపొందించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు మల్యాల బాలస్వామి జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

- సెప్టెంబర్ 12 నుంచి 17 వరకు సిపిఎం కార్యక్రమాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు అన్నారు. సెప్టెంబర్ 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్‌లోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు.

1946 నుంచి 1951 వరకు ఐదేళ్లపాటు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే మహోన్నత ప్రజా పోరాటమని అన్నారు. భూస్వాములు, దొరలు, జాగీర్దారులు, నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులు, పేదలు, సామాన్య ప్రజలు దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కుల, మత, ప్రాంత, భాషలకు అతీతంగా ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు.

పోరాటాన్ని హిందూ–ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ కొందరు చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఇది ఏ మతానికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదని, కులమతాలకు అతీతంగా సాగిన ప్రజా ఉద్యమమని స్పష్టం చేశారు. చారిత్రక వాస్తవాలను నేటి తరానికి తెలియజేసి, పోరాట స్ఫూర్తిని అందించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. వారోత్సవాల్లో ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేశ్య నాయక్, పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, తారా సింగ్, మధు, నాగరాజుగౌడ్, సురేష్, తిరుపతయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ, శివరాం, బాలరాజు, కురుమయ్య, వెంకటేష్, జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కావేరమ్మపేటలో కోలాహలంగా ఉట్ల కార్యక్రమం



**జడ్చర్ల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట గ్రామ చావిడి వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాపల్లి నరసింహ యాదవ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్ల ఉత్సవం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వడ్లని శేఖర్ యాదవ్ మాట్లాడుతూ పశు సంపదకు, సృజనాత్మకతకు, స్నేహానికి, ప్రేమకు మూలమైన చారిత్రక మహా నాయకుడు శ్రీకృష్ణుడు అని కొనియాడారు. ఆయన ప్రజాపాలకుడిగా, ఆది యోధుడిగా నిలిచారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడికి ఏ గురువు లేరని, ఆయనే గురు స్థానంలో ఉండి ఈ భారతీయ సమాజానికి రాజనీతిని ప్రబోధించిన రాజకీయ తాత్వికుడు శ్రీకృష్ణుడు అని అన్నారు. వేడుకల్లో చిన్ని కృష్ణుడి వేషధారణలో వచ్చిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, యువకులు ఎంతో ఉత్సాహంతో పోటీపడి ఉట్లను కొట్టారు. కార్యక్రమంలో యాదవ యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సాధించిన పేద విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** పేదరికాన్ని అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని బి. హేమావతిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభినందించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ వైద్య విద్యలో సీటు సాధించడం గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన హేమావతిని ఆదివారం వనపర్తిలోని తన నివాసంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డంకి కాదని హేమావతి నిరూపించిందన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉంటే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హేమావతి కష్టపడి చదివి వైద్యురాలిగా ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే స్థాయికి ఎదగాలని కోరారు. హేమావతి తండ్రి బి. మాధవుడు 2019లో మృతి చెందగా, అప్పటి నుంచి ఆమె తల్లి బి. లత కూలి పని చేస్తూ కుమార్తెను చదివించారు.

తల్లి పడిన కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని హేమావతి వైద్య విద్యలో అడుగుపెట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. తనను అభినందించి ప్రోత్సహించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి హేమావతి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని కుటుంబ సభ్యులతో పాటు కౌన్సిలర్లు చుక్కరాజు, కోట్ల రవి, కాంగ్రెస్ నాయకులు బయల్ శ్రీను, గణేష్, మండ్ల దేవన్న నాయుడు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ విద్యా పర్యటనకు కర్ని పీడీ బి.రూప ఎంపిక

- **జిల్లాకే గర్వకారణమన్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు**



**మక్తల్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు, ఆధునిక విద్యా విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మక్తల్ మండలం కర్ని జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూప జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో విద్యాశాఖ ఈ పర్యటనను ఏర్పాటు చేసింది.

సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు వారం రోజుల పాటు సాగే ఈ బృందంలో రాష్ట్రవ్యాప్తంగా 29 మంది ఉపాధ్యాయులు, 11 మంది విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

**అంతర్జాతీయ విధానాల పరిశీలన...**

పర్యటనలో భాగంగా జపాన్‌లోని విద్యాసంస్థలను సందర్శించి అక్కడి తరగతి గదుల నిర్వహణ, విద్యా రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం, విద్యార్థుల్లో క్రమశిక్షణ, జీవన నైపుణ్యాల పెంపు వంటి అంశాలను వీరు సమగ్రంగా పరిశీలిస్తారు. అక్కడ అధ్యయనం చేసిన ఉత్తమ విధానాలను మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వికాసానికి ఏ విధంగా అమలు చేయవచ్చో నివేదిక రూపొందించనున్నారు. మండల పరిధిలోని సాధారణ ప్రభుత్వ పాఠశాల నుంచి ఒక వ్యాయామ ఉపాధ్యాయురాలు అంతర్జాతీయస్థాయి అధ్యయన పర్యటనకు ఎంపిక కావడంపై కర్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు సంతోషం వ్యక్తం చేశారు. బి.రూప ఎంపిక కర్ని పాఠశాలకే కాకుండా యావత్ నారాయణపేట జిల్లాకే గర్వకారణమని కొనియాడుతూ, ఆమె పర్యటన దిగ్విజయంగా ముగియాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఏలుసరి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎరుకల సంఘంలో చేరికలు



**అడ్డాకుల, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోనిడాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు మాన్ పాడు బాలయ్య (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్,, రాష్ట్ర అధ్యక్షులు ్రాశీఅఖుఝ్రీ ఎలుసరి కృష్ణయ్య పాల్గొని వేరే సంఘాల్లో పనిచేసి ఈ రోజు తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం (TYSS) ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు నచ్చి సంఘం లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించడం జరిగింది. చేరిన వారిలో ఎలుసరి బాలరాజుమంగరాయి వెంకటేష్,ఎలుసరి శ్రీనివాసులు, నల్లగొండ శాంతయ్య, నాగసారుతు పవన్ కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్యమాట్లాడుతు గత25సంవత్సరాలుగా నీతిగా, నిజాయితీగా ఎరుకల జాతి సంక్షేమము కోసం, ఆత్మ గౌరవం కోసం, అభ్యున్నతి కోసం, హక్కుల కోసం మా వంతు పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే. చదువుకున్న ఎరుకల విద్యావంతులు ,మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు వెనుకబడిన వారి సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో అన్ని మండలాల్లో తిరిగి నూతన కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని తద్వారా రాష్ట్రంలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘంను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. అడక్ కమిటీని నియమించడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మంగరాయి వెంకటేష్,, ఉపాధ్యక్షులుగా ఏలసరి బాలరాజ్, నల్లగొండ శాంతయ్య, నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుసరి తిరుమలేష్ , ఎలుసరి రామస్వామి ముద్దని చెన్నయ్య, కుంభ రామ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధిపై సర్పంచులకు శిక్షణ




**ఉప్పునుంతల, (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, గ్రామపంచాయతీలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఉప్పునుంతల మండలానికి చెందిన ముగ్గురు సర్పంచులు పాల్గొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని చింతగల శ్రీనివాసులు, జిల్లెల జగత్‌రెడ్డి, శ్రీలత రెడ్డి పాల్గొని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన పొందారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, ప్రభుత్వ పథకాల వినియోగం, గ్రామపంచాయతీల పరిపాలనపై మరింత అవగాహన కలిగిందని సర్పంచులు పేర్కొన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను తమ గ్రామాల్లో అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

# గుప్త నిధుల కోసం తవ్వకాలు

- **వ్యవసాయ భూమిలో జేసీబీతో అక్రమ ం తవ్వకాలు**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** గుప్త నిధుల కోసం వ్యవసాయ భూమిలో జేసీబీతో అక్రమంగా తవ్వకాలు చేసిన ఘటన ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామ శివారులో సర్వే నంబర్ 384లోని రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో సెప్టెంబర్ 5న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. చేతబడి/క్షుద్ర పూజలు నిర్వహించి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసినట్లు ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న ఫిర్యాదుదారుడు మరుసటి రోజు హైదరాబాద్ నుంచి వచ్చి భూమిని పరిశీలించగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలంలో జేసీబీ, రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారని, నిందితులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# బస్సులోనే కుప్పకూలిన కండక్టర్

- **సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో తప్పిన ముప్పు**



**కల్వకుర్తి,సెప్టెంబర్ 6,(జనంసాక్షి):** కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ అనిత ఆదివారం అస్వస్థతకు గురై బస్సులోనే కుప్పకూలారు. దేవరకొండకు వెళ్లి తిరిగికల్వకుర్తికి వస్తుండగా చారకొండ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కండక్టర్ అనిత ఒక్కసారిగా అస్వస్థతకు గురైకిందపడిపోవడాన్ని గమనించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో డ్రైవర్ బస్సును నేరుగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తపోటు తగ్గిపోవడం వల్లే ఆమె అస్వస్థతకు గురైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం వైద్యులు ఆమెకు చికిత్స అందించారు.ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు,ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రజా పాలన 1,000 రోజుల విజయోత్సవం

- **నర్సాపూర్‌లో నేడు కాంగ్రెస్ వికాస యాత్ర భారీగా తరలిరావాలి**
- **కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్**



**కొల్చారం, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం 1,000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో విజయోత్సవ వికాస యాత్ర నిర్వహించనున్నట్లు కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు.

నేడు ఉదయం 9:30 గంటలకు నర్సాపూర్ పట్టణంలోని శ్రీ మల్లన గుడి వద్ద నుంచి వికాస యాత్ర ప్రారంభమై నర్సాపూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఈ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి కొల్చారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ పిలుపునిచ్చారు.

# జిరాక్స్, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

- **మండల కేంద్రంలో నూతన సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేడమోని భాస్కర్ నూతనంగా ఏర్పాటు చేసిన జిరాక్స్ సెంటర్, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకుడు మేడమోని భాస్కర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు వేల్టూరి రేనయ్య, యువజన కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి అంతటి శేఖర్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగటి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**నారాయణపేట, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** అనారోగ్యంతో చికిత్స పొందిన నారాయణపేట జిల్లా కేంద్రం దూల్‌పేటకు చెందిన దట్టురావు కు ఆదివారం హైద్రాబాద్‌లోని తన కార్యాలయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి 60 వేల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కే ంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ మాట్లాడుతు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# కెసిఆర్‌తో హ్యాట్రిక్ ఎమ్మెల్యే.. గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** ఆదివారం ఎర్రవల్లిలో మాజీముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో హ్యాట్రిక్ ఎమ్మెల్యే, పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పటాన్చెరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దామని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం మూలంగా అభివృద్ధి కుంటుపడిందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకుని వచ్చిన 22ఏ నిషేధిత జాబితా మూలంగా పటాన్చెరు నియోజకవర్గంలో 50 వేలకు పైగా ఎకరాల భూములు నిషేధిత జాబితాలో చేర్చారని.. ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కేసీఆర్‌కి విన్నవించారు.కెసిఆర్ నాయకత్వంలో తిరిగి రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే జిఎంఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# బొమ్మల పల్లకి పురస్కార చారిత్రక యాత్ర



**సదాశివపేట, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** సదాశివపేట మండలం నందికంది గ్రామంలో ఆదివారం కొత్త తెలంగాణ చరిత్ర ఆధ్వర్యంలో బొమ్మల పల్లకి పురస్కార చారిత్రక యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి బైరోజు శ్యాంసుందర్, భద్ర గిరీష్, రామోజీ హరగోపాల్, కట్టా శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను ప్రజలకు చాటిచెప్పేందుకు చారిత్రక యాత్రలను సభలుగా నిర్వహించడమే తమ సంకల్పమన్నారు. నందికందిలోని రామలింగేశ్వర ఆలయ చారిత్రక ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పేట శ్రీనివాస్, ఉపసర్పంచ్ శివరాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నాగటి మల్లయ్య



**ఉప్పునుంతల, (జనంసాక్షి):**
ఉప్పునుంతల మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ నాగటి మల్లయ్య నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మల్లయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాగటి మల్లయ్యకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

నియామకంపై నాగటి మల్లయ్య సంతోషం వ్యక్తం చేస్తూ తనపై నమ్మకంతో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ, వర్ధం వెంకయ్య, మద్దెల బండ లక్ష్మయ్య, మర్రిపల్లి గ్రామ యూత్ అధ్యక్షుడు, వార్డు నంబర్ అశోక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి యువకుడిని అభినందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** స్వయం ఉపాధి ద్వారా తన కాళ్లపై తాను నిలబడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న యువకుడు శ్రీకాంత్‌ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభినందించారు. కుల వృత్తిని గౌరవంగా కొనసాగిస్తూ కష్టపడి పనిచేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదివారం ఉదయం వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డులో ఉన్న రాయల్ హెయిర్ కటింగ్ షాప్‌కు ఎమ్మెల్యే మేఘారెడ్డి వెళ్లి సాధారణంగా హెయిర్ కటింగ్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా రాజానగరం గ్రామానికి చెందిన షాప్ నిర్వాహకుడు శ్రీకాంత్‌తో ఆత్మీయంగా మాట్లాడి, అతని కుటుంబ పరిస్థితులు, ఉపాధి గురించి అడిగి తెలుసుకున్నారు.ఉద్యోగం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా స్వయం ఉపాధిని ఎంచుకుని హెయిర్ కటింగ్ షాప్ నిర్వహిస్తున్నట్లు శ్రీకాంత్ ఎమ్మెల్యేకు వివరించారు. అతని ఆలోచనను అభినందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి పనిచేయాలని సూచించారు. తమకు తెలిసిన వృత్తిని గౌరవంగా కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషించుకోవడం గర్వించదగిన విషయమన్నారు.ఉద్యోగం వస్తేనే జీవితం బాగుపడుతుందనే ఆలోచనకు పరిమితం కాకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి సాధించాలని యువతకు సూచించారు. కష్టపడే యువతకు సమాజం నుంచి ప్రోత్సాహం, గౌరవం లభించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే, కష్టపడి పనిచేసే యువతకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సాధారణంగా హెయిర్ కటింగ్ చేయించుకునేందుకు వెళ్లిన ఎమ్మెల్యే.. యువకుడి జీవన విధానాన్ని తెలుసుకుని అభినందించడం స్థానికులను ఆకట్టుకుంది.

# బీఎల్‌ఓలు సూచించిన పత్రాలను గడువులోగా సమర్పించాలి

- **కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు**



**సదాశివపేట, సెప్టెంబర్ 6(జనంసాక్షి):** ఎస్ఐఆర్ నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు అన్నారు. ఎస్ఐఆర్ ఇచ్చిన నోటీసుకు స్పందించిన సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు సంబంధిత పత్రాలను బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) జయశ్రీకి అందజేశారు. సదాశివపేట పట్టణం లోని గురునగర్ కాలనీ 10వ వార్డులో ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...** ఎస్ఐఆర్ నోటీసులు అందిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బీఎల్‌ఓలు సూచించిన పత్రాలను గడువులోగా సమర్పించి ఓటు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. వయస్సు, తండ్రి పేరు, ఇంటిపేరు తదితర వివరాల్లో తప్పులు ఉన్నవారు సరైన ధ్రువ పత్రాలను అంద జేయాలని కోరారు.

నోటీసులో పేర్కొన్న తేదీ, సమయానికి అవసరమైన పత్రాలతో బీఎల్‌ఓను సంప్రదించాలని, సందేహాలుంటే నోటీసులో ఉన్న బీఎల్‌ఓ ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌ఓలకు సహకరించాలని పులిమామిడి రాజు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బగిలి విష్ణు, నర్సింలు, షకీల్, రాము, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల హామీలపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి



**కల్వకుర్తి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** పదేళ్లపాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ నేతలు మూడేళ్ల కాంగ్రెస్ ప్రజా పాలనను విమర్శించడం విడ్డూరంగా ఉందని వెంకటాపూర్ ఉపసర్పంచ్ నంబు ఇస్తారీ అన్నారు. గత పాలనలో ఇచ్చిన హామీలు, వాటి అమలుపై సమాధానం చెప్పిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించాలని సూచించారు.

దళిత బంధు పథకం కింద కల్వకుర్తి నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో ఎంతమందికి లబ్ధి చేకూర్చారో బీఆర్ఎస్ నేతలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల సాగుభూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. పదేళ్లలో ఎంతమందికి ఇళ్లు ఇచ్చారో లెక్కలు వెల్లడించాలని కోరారు.

ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3,016 భృతి ఇస్తామని ప్రకటించి అమలు చేయలేదని ఆరోపించారు. ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షల విషయంలో జరిగిన పరిణామాలతో విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోయారని అన్నారు. రైతు రుణమాఫీని విడతలవారీగా అమలు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చర్యలు చేపడుతుంటే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుంటోందని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలకు విమర్శించే హక్కు ఉన్నప్పటికీ అవి వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. గత హామీలపై సమాధానం చెప్పకుండా ప్రస్తుత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని, బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని నంబు ఇస్తారీ హితవు పలికారు.

# ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ మాదిగ



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన దేవరపాగ ప్రభాకర్ మాదిగ నియమితులయ్యారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకత్వం ఈ నియామకం చేపట్టింది.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావం నుంచే ఉద్యమంలో పనిచేసిన ప్రభాకర్ మాదిగ, ఉద్యోగం అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడిగా ఐదుసార్లు బాధ్యతలు నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, యువత ప్రోత్సాహానికి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు.

తన నియామకం మరింత బాధ్యతను పెంచిందని ప్రభాకర్ మాదిగ అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మాదిగ ఉద్యోగులను ఐక్యంగా సంఘటితం చేసి సర్వీస్ సమస్యలు, ప్రమోషన్లు, రిజర్వేషన్ల అమలు, ఖాళీ పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తానన్నారు. మాదిగ ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఆయన నియామకంపై జిల్లా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాధిక భూపతి రాజు



**మెదక్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** పట్టణ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారు.

పట్టణంలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర ప్రజా సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం చైర్మన్ పనితీరులో ప్రత్యేకతగా నిలుస్తోంది.

అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. పట్టణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమానంగా మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేస్తున్నారు.

"ప్రజల నమ్మకమే మా బలం.. పట్టణ అభివృద్ధే మా లక్ష్యం" అనే ఆలోచనతో ముందుకు సాగుతూ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్న రాధిక భూపతి రాజు తీరుపై స్థానికంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఆమె నాయకత్వంలో మెదక్ పట్టణం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశం ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ లో అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజల సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాటం చేయాలి

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పనిచేసేందుకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా ముందుకు సాగాలి

# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

పోలీస్, విద్యుత్ శాఖలకు ఇబ్బందులు, ప్రజలకు రాకపోకల్లో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మండపాల వద్ద అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లతో పాటు పోలీస్, విద్యుత్ శాఖ అధికారుల నంబర్లను బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. నిర్వాహకులు విద్యుత్ శాఖ సూచనలు పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా నిర్వహించాలని డీఈ కోరారు.

# రజక సంఘం జిల్లా భవన నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకరిస్తాను

- **తెలంగాణ రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ అజయ్ కుమార్**



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 06 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని రజక సంఘం జిల్లా భవన నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని తెలంగాణ రాష్ట్ర రజక ఫెడరేషన్ చైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు.గత ప్రభుత్వం హయాంలో వనపర్తి జిల్లా కేంద్రం రాజాపేట శివారులో రజక సంఘం జిల్లా భవన నిర్మాణానికి 8 గుంటల స్థలాన్ని మంజూరు చేయించడం జరిగింది. జిల్లా రజక సంఘం నాయకులు ఘనపురం విజయ్ కుమార్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అజయ్ కుమార్ ఆ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వనపర్తి పట్టణంలోని నల్లచెరువు సమీపంలో ఉన్న ధోబీఘాట్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రజక సంఘం భవన నిర్మాణానికి అవసరమైన ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులను కలిసి కృషి చేస్తానన్నారు.

అలాగే లాండ్రీ షాపులకు సంబంధించిన ఉచిత విద్యుత్ బకాయిలను ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ బకాయిల విషయంలో రజకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయంపై రాష్ట్ర విద్యుత్ శాఖ, బీసీ శాఖ మంత్రులు, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

రాబోయే రెండు మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గానికి రెండు ఆధునిక ధోబీఘాట్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అలాగే రజక సంఘాలకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని అజయ్ కుమార్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక ఫెడరేషన్ వైస్ చైర్మన్ బంగారు బాబు, రజక సంఘం జిల్లా నాయకులు ఘనపురం విజయ్, పాలకొండ సత్యనారాయణ, వెంకట్రాములు, లక్ష్మయ్య, బండాలయ్య, మార్కెట్ కమిటీ సభ్యుడు రఘునాథ్, మదనపురం బాలస్వామి, శేఖర్,తేనీటి ఆంజనేయులు, పాపన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గోమాంసం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఇలాంటివి ఇంకోసారి జరగకుండా గోవధ నిషేధిత చట్టం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తంగిడిగి గ్రామ సర్పంచ్ కు సూచించారు. ఈ ఘటనకు కారణమైన వాళ్లను ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్ట బోమని కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మండల బీజేవైఎం అధ్యక్షులు వొట్టే వోళ్ళ సురేష్ మాట్లాడుతూ, గో సంరక్షణకు సంబంధించిన చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. గ్రామంలో అక్రమ గోమాంసం రవాణా, అమ్మకాలు కొనసాగితే సామాజిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా పెట్టాలని, మళ్లీ ఇలాంటి అక్రమ కార్యకలాపాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండి, ఇలాంటివి మళ్లీ కనిపిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కేసీఆర్ రాజీనామా చేయాలి.. రసమయి భాష మార్చుకోవాలి



**బెజ్జంకి, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన భాష మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బెజ్జంకిలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజాధనం తీసుకుంటున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ రాజకీయాలు మానుకుని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై రసమయి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులే!

- **ఉత్తమ సేవలకు ప్రతిభా పురస్కారాలు**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** మనిషి జీవితంలో ప్రతి దశలోనూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటాడు. ఆ అభ్యాసం వెనుక గురువు పాత్ర ఎంతో కీలకం. తల్లిదండ్రులు ప్రథమ గురువులైతే.. విద్యార్థి భవిష్యత్తుకు రూపునిచ్చే ప్రత్యక్ష గురువు ఉపాధ్యాయుడే. అందుకే సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తూ గురువులను స్మరించుకుంటాం. విద్యాబోధనతో పాటు పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందారు.

**ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతూ.. నర్సింలు:**



రాయికోడ్ మండలం కర్చల్ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన నర్సింలు ప్రస్తుతం మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందిస్తున్నారు. విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు మూతపడిన పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు చేసిన కృషికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

**చదువులమ్మ సేవలో.. కల్పన:**



మునిపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కల్పన విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచుతున్నారు. క్లిష్టమైన అంశాలను సులభంగా బోధిస్తూ, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా నూతన బోధనా పద్ధతులు అవలంబిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో పాటు ప్రతి ఏడాది విద్యార్థులను బాసర ట్రిపుల్‌ఐటీకి పంపేందుకు కృషి చేస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

**వృత్తిని దైవంగా భావిస్తూ.. కృష్ణయ్య:**



పెద్దపూర్ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో మునిపల్లి మండల నోడల్ అధికారిగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థంగా పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్థుల సమన్వయంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన సేవలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం లభించింది.

**ఒత్తిడిలేని విద్య అందిస్తూ.. శరణమ్మ:**



మునిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శరణమ్మ విద్యార్థులకు ఒత్తిడిలేని విద్య అందించాలని సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ టీఎల్ఎంల ద్వారా అభ్యసన స్థాయిని మెరుగుపరుస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి చేసిన కృషికి ఆమె జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**నిజాంపేట్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ మండలంలోని బాచేపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పత్తిగారి లక్ష్మి, ఉపసర్పంచ్ బూమ్‌శెట్టి సరితా పెంటయ్య, నారాయణఖేడ్ కాంగ్రెస్ యువ నాయకుడు పత్తిగారి శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు సహకరి శివ, బాబ్య నాయక్, సురేష్, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.